* * *

కామేశ్వరికి వీసా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంకో పది రోజుల్లో బయల్దేరాలి. తండ్రి తమతో రాకపోవడం మాధవన్‌కి బాధగానే ఉంది. రాత్రి మాధవ్ రూమ్‌లోకి వెళ్లింది కామేశ్వరి. తల్లిని చూసి..

''ఏమ్మా! ఇంకా నిద్రపోలేదా? నాతో పనేమైనా ఉందా?'' ఆత్రుతగా అడిగాడు మాధవ్.

''మాధవ్.. నేను ఒకమాట అడుగుతాను. తప్పుగా తీసుకోవద్దు. నాకు నాన్నగారిని వదిలి అమెరికా రావాల నిపించడం లేదురా! మీరు వెళ్లిరండి. తర్వాత నేనూ, నాన్నగారూ వీలు చూసుకుని అక్కడికి వస్తాం''

మాధవన్, మార్గరెట్ ఆశ్చర్యంగా చూశారు కామేశ్వరిని.

''సర్లేమ్మా! నాకు అర్థమైపోయింది. నువ్వు మార్గరెట్‌ని నీ కోడలుగా మనస్ఫూర్తిగా అంగీకరించలేదని తెలుస్తోంది. ఆమె వేరే దేశానికి చెందిన అమ్మాయి అయి ఉండొచ్చు. కానీ, ఆమె ఈ ఇంటి వారసుణ్ని తన కడుపులో మోస్తోంది. మన దేశ సంస్కృతిని, ఇక్కడ ఒకరిపై ఒకరు చూపించుకునే ప్రేమాభిమానాల్ని చూసే.. నన్ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. డెలివరీ సమయంలో తనకి తోడుగా ఉండమని అడిగితే నిరాకరించడానికి మీ మనసెలా ఒప్పుకొందమ్మా! నువ్వు, నాన్నగారూ తనతోపాటు ఆమెరికా వస్తారని, తనకి తోడుగా ఉంటారని ఎంతో నమ్మకం పెట్టుకుంది మార్గరెట్. కానీ, ఒక్క నిమిషంలో మా నమ్మకాన్ని ముక్కలు చేసేశావు కదమ్మా!'' మాధవన్ గొంతులో కోపం తొంగి చూసింది.

''లేదు నాన్నా! నేను చెప్పేది కొంచెం విను!''

''వద్దమ్మా ప్లీజ్! ఇంతటితో ఈ టాపిక్‌ను ముగించేద్దాం. మేము ఎలా వచ్చామో అలాగే వెళ్లిపోతాం. ఎవరూ మాతో రావొద్దు'' అంటూ ముఖం తిప్పుకొన్నాడు మాధవన్.

కామేశ్వరికి ఏం మాట్లాడాలో తెలీక నిశ్శబ్దంగా అక్కడినుంచి వెళ్లిపోయింది.

మార్గరెట్ విచారంలో మునిగిపోయింది.

''ఇక్కడ ఉన్నన్ని రోజుల్లో నువ్వు చూడాలనుకున్న వన్నీ చూసేసి బయల్దేరిపోదాం'' అన్నాడు మాధవన్. కళ్లలో తిరుగుతున్న కన్నీటిని బయటికి రానీయకుండా.

''నాన్నగారూ! నేనూ, మార్గరెట్ ఇవ్వాళ గోవాకి బయల్దేరుతున్నాం. తిరిగి మేం అమెరికా వెళ్లడానికి ఒక రోజు ముందే వస్తాం!''

''అలాగే వెళ్లరా! మార్గరెట్‌కి అన్నీ చూపించు. అవన్నీ చూసిన తర్వాత బాలఏసులాంటి మనవణ్ని కని ఇవ్వమని చెప్పు'' అంటూ.. మౌనంగా నిలబడి ఉన్న కొడుకు దగ్గరికి వచ్చి..

> **ఈ క్షణం వరకూ మేమిద్దరం మంచి స్నేహితులుగానే ఉండిపోయాం. మామధ్య ఎలాంటి దాంపత్య సంబంధాలూ లేవు. తన స్నేహితుడి కుటుంబం కోసం తన జీవితాన్నే కర్పూరంగా మార్చి కరిగిపోతున్నారు. అంతేకాదు మాధవన్! పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యి పడిపోయిన మీ తాతకి తనే అన్నీ అయి చూసుకోసాగారు. ఆయన కూడా రామారావు గారి తండ్రి కాదు. ప్రేమ పెళ్లి చేసుకున్నానని నన్ను ఇంటి నుంచి తరిమేసిన మా నాన్నే.**

''చూడు మాధవ్! అమ్మా, నేనూ రావడం లేదని బాధపడకురా! నేను లేకుండా రావడానికి అమ్మ ఇష్టపడటం లేదు. ఇక్కడ మా బాధ్యతల్ని పూర్తిగా నిర్వహించిన తర్వాత తప్పకుండా అమెరికా వస్తాం.. సరేనా?'' కొడుకుని సమాధానపరిచాడు రామారావు.

* * *

ఇంటి ముందు టాక్సీ నిలబడి ఉంది.

''ఫ్లయిట్‌కి టైం అవుతోంది. త్వరగా రా మార్గరెట్''.. అంటూ, ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు తాగుతున్నాడు మాధవన్.

నెమ్మదిగా కొడుకు దగ్గరికి వచ్చింది కామేశ్వరి. మాధవన్ చేతికి ఒక కవరిచ్చి..

''తొందర లేదురే! గోవాకి వెళ్లి అన్నీ చూసిన తర్వాత నిదానంగా ఈ ఉత్తరం చదువుకో!'' అంది కళ్లలో నీళ్లు తిప్పుకొంటూ.

ఆమె కన్నీళ్ల అర్థం కాక.. కవర్ తీసుకొని గబగబా నడిచి వెళ్లిపోయాడు మాధవన్.

ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో కూర్చొన్న తర్వాత జేబులోంచి లెటర్ తీసి మార్గరెట్ చేతికిచ్చాడు.. లోపల పెట్టమని. కానీ, మార్గరెట్ అక్కడే కవర్ చింపి ఆ లెటర్‌ని చదవసాగింది ఆత్రుతగా.

**ప్రియమైన మాధవన్, మార్గరెట్‌కి,**

దయచేసి మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకోకండి. మేము మీమీద చూపించే ప్రేమలో ఏ మాత్రమూ లోపం లేదు. అది మీరు తెలుసుకోవాలి. అదీ కాకుండా మీ నాన్నగారిని మీరు తప్పుగా అర్థం చేసుకోకూడదని నేను ఇంత కాలమూ దాచిన ఒక రహస్యం మీకు చెప్పాలనుకుంటున్నా. మాధవన్.. నువ్వు నా కడుపులో ఉన్నప్పుడే ఒక యాక్సిడెంట్‌లో మీ నాన్నగారు చనిపోయారు. ఈ రామారావు గారు మీ నాన్నకాదు. పెద్దల్ని ఎదిరించి పెళ్లిచేసుకుని.. అందర్నీ దూరం చేసుకున్నాను. మీ నాన్నగారి మరణంతో అందరి ఆదరాభిమానాల్నీ కోల్పోయాను. ఒంటరిగా మిగిలిపోయాను. అలాంటి సమయంలో మీ నాన్న స్నేహితుడైన ఈ రామారావు గారు నన్ను పెళ్లి చేసుకుని.. సమాజంలో నాకొక స్థానం సంపాదించి పెట్టారు. అలాగే నువ్వు తండ్రిలేని అనాథవి కాకూడదని తనే నీకు నాన్న అయ్యారు. నీ దగ్గర మనసు విప్పి చెబుతున్నాను.

ఈ క్షణం వరకూ మేమిద్దరం మంచి స్నేహితులుగానే ఉండిపోయాం. మామధ్య ఎలాంటి దాంపత్య సంబంధాలూ లేవు. తన స్నేహితుడి కుటుంబం కోసం తన జీవితాన్నే కర్పూరంగా మార్చి కరిగిపోతున్నారు. అంతేకాదు మాధవన్! పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యి పడిపోయిన మీ తాతకి తనే అన్నీ అయి చూసుకోసాగారు. ఆయన కూడా రామారావు గారి తండ్రి కాదు. ప్రేమ పెళ్లి చేసుకున్నానని నన్ను ఇంటి నుంచి తరిమేసిన మా నాన్నే. అమ్మ చనిపోయిన తర్వాత అన్నయ్యలు చేతులు దులిపేసుకుంటే.. ఎవరి ప్రేమకీ నోచుకోక నా దగ్గరికి వచ్చారు. ఆయన్ని మన కుటుంబంలో ఒకరిగా ఆదరించారు రామారావుగారు. ఈరోజు వరకూ మీ తాతయ్యని తన తండ్రిగానే చూసుకుంటున్నారు రామారావుగారు.

ఆయనకి భార్యగా జీవిస్తున్న నేను.. నిజానికి భార్యగా ఏమీ ఇవ్వలేకపోయాను. నువ్వు ఆయన కొడుకువి కాదు. నీ తాత ఆయన తండ్రి కాదు. అయినా సరే.. ఆయన చూపే ప్రేమానురాగాలలో నువ్వేమైనా తప్పు పట్టగలవా? చెప్పు మాధవ్? జన్మతః వచ్చేవే కాదు బంధుత్వాలు. ప్రేమతో, అనురాగాలతో కూడా బంధుత్వాలని ఏర్పరుచుకోవచ్చని నిరూపించారు మీ నాన్నగారు. అలాంటి ఆయన్ని విడిచి మీతో రావడం న్యాయమా చెప్పు? జీవితాంతం ఆయన పక్కనే ఉండి ఆయన సేవ చేసుకోవాలన్నదే నా కోరిక. ఆయన మీనుంచి ఆశించేది కూడా.. మీ ప్రేమ మాత్రమే.

ప్రేమతో..

**అమ్మ.**

* * *

మంచం మీద కళ్లు మూసుకుని పడుకుని ఉన్న రామారావుకి.. నీడలా ఏదో కదలినట్లనిపిస్తే కళ్లు తెరిచి చూశాడు.

ఎదురుగా మాధవన్, మార్గరెట్.

''ఏమిటి మాధవా?. ఫ్లయిట్ ఏమైనా క్యాన్సిల్ అయ్యిందా''? అంటూ లేచి కూర్చున్నాడు.

''లేదు నాన్నగారూ! ఉన్న పది రోజులూ మీతోనూ, అమ్మతోనూ గడపాలని గోవా వెళ్లకుండా వచ్చేశాం''.. తండ్రిని ఆరాధనగా చూస్తూ అన్నాడు మాధవన్.

'నేను చూడాలని ఆశపడ్డ ఆ బాలఏసు నా కళ్లెదురుగా ప్రశాంతంగా కూర్చుని ఉంటే.. మీ కాళ్ల దగ్గర ఆనందంగా జీవించాలని వచ్చేశాం మామయ్యా!' అని మనసులోనే అనుకుంటూ..

కామేశ్వరిని మంచం మీద కూర్చోబెట్టి వాళ్ల కాళ్ల దగ్గర కూర్చొంది మార్గరెట్.. కళ్లలో ఆనందబాష్పాలు తిరుగుతూ ఉంటే! ■

## సూరిశెట్టి వసంతకుమార్



'బంధుత్వాలు అనేవి జన్మతః మాత్రమే వచ్చేవి కాదు. ప్రేమతో, అనురాగాలతోనూ బంధుత్వాలను ఏర్పరుచుకోవచ్చు' అని నిరూపించే కథ.. దైవం మానుష్య రూపేణ. రచయిత సూరిశెట్టి వసంత కుమార్. బి.ఎ. చదివారు. నెల్లిమర్ల జూట్ మిల్లులో 20 ఏళ్లు పర్సనల్ మేనేజర్‌గా ఉద్యోగం చేసి.. పదవీ విరమణ చేశారు. తండ్రి సూరిశెట్టి సాంబశివరావు. దాదాపు 20 ఏళ్లపాటు బాలమిత్రకి ఎడిటర్‌గా చేశారు. తండ్రి దీవెనలతోనే రచనారంగంలో రాణిస్తున్నట్లు రచయిత చెబుతున్నారు. ఇప్పటి వరకు 30 కథలు, 25 ఆర్టికల్స్ రాశారు. అవన్నీ ప్రముఖ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం కథల పోటీతో పాటు ఉషా పక్షపత్రిక, జాగృతి, సాహితీ కిరణం, విశాలాక్షి సంస్థలు నిర్వహించిన వివిధ కథల పోటీల్లోనూ బహుమతులు గెలుచుకున్నారు. తనను విమర్శించే శ్రీమతి గోమతికి, ప్రోత్సహించే పిల్లలు శక్తీ, శాంతి, పవన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.